క్లుప్తంగా

విశ్వరూప మహాసభకు తరలివెళ్లిన నాయకులు



సాక్షి, నెట్‌వర్క్: సికింద్రాబాద్‌లో శనివారం మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు జిల్లా అన్ని మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయం కోసం నిర్వహించే మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానుండటంతో తమకు తప్పని సరి న్యాయం దొరుకుతుందని నాయకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలధారణ



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వార మైన ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం కన్నెమొల మహాగణపతి ఆశ్రమం గురుస్వామి కేతేపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో రవి, జయానంద్, ఖాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

మాలలు, దుస్తుల వితరణ

కల్వకుర్తి: కార్తీక మాసంలో శివదీక్ష తీసుకునే భక్తులకు పట్టణానికి చెందిన కర్నాకర్‌రెడ్డి 30 మందికి మాలలు, దుస్తులను శనివారం ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం నరేందర్, శేఖర్, నరేష్ యాదవ్, బాలరాజు తదితరులు ఉన్నారు.

అబుల్ కలాం ఆజాద్ జయంతి

కల్వకుర్తిరూరల్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముజ్జు, షకీల్, వాహెద్, శ్రీను, రవి, ఖాదర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులకు అధికారి నియామకం

కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారిని నియమించింది. నియోజకవర్గంలో ఫిర్యాదులు పరిశీలించేందుకు ఐఏఎస్ అధికారి సతీష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన ప్రభుత్వ పనిదినాలలో ప్రతి రోజు పట్టణంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు అందుబాటులో ఉంటారు. లేకుంటే 8977061895 నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

శివ లింగానికి నాగపడిగె బహూకరణ

లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న శివలింగానికి గ్రామానికి చెందిన నేనావత్ లక్ష్మి, రాంచందర్ దంపతులు శనివారం నాగ పడిగెను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తాం

తెలకపల్లి: బీఎస్పీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి కొత్తపల్లి కుమార్ కోరారు. శనివారం మండలంలోని గట్టురాయిపాకులలో ప్రచారం నిర్వహించారు. ఇన్నేళ్లుగా అనేక ప్రభుత్వాలు పాలించాయని, దళిత బహుజనులను పట్టించుకోలేదన్నారు. దళిత బహుజనులకు న్యాయం కావాలంటే బీఎస్పీతోనే సాధ్యమన్నారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదింటి దళిత మహిళలకు ఎకరా భూమి, వాషింగ్ మిషన్, ఉచిత ఆరోగ్య బీమా వంటి పథకాలను వర్తింప చేస్తామన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం చిన్న కొత్తపల్లికి చెందిన పలువురు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ బలమైన శక్తిగా మారిందని, వచ్చే ఎన్నికల్లో తమదే గెలుపని అన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

ఉప్పునుంతల: మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారాలు పోటాపోటీగా సాగుతున్నాయి. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటా అనంతరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుడు కట్టా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మర్రిపల్లి, లక్ష్మాపూర్ తదితర బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎత్తిపోతలతో సస్యశ్యామలం

- జీల్‌దార్‌తిప్పకు కృష్ణానీటిని మళ్లించేందుకు ఇప్పటికే నిధులు
- మల్లేశ్వరం, వేంకల్ మినీ ఎత్తిపోతల పథకాల పూర్తికి ఎన్నికల కోడ్ అడ్డంకి
- పనులు పూర్తయితే 10వేల ఎకరాల మేర సాగునీరు



అసంపూర్తిగా వదిలేసిన వేంకల్ లిఫ్టు

కొల్లాపూర్: సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రంగా ఉన్న నియోజకవర్గంలో మినీ లిఫ్టులు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలో పలు లిఫ్టుల కింద ఉన్న ఆయకట్టు భూములు కేఎల్ఐ, జూరాల కిందికి వచ్చాయి. మిగిలిని కొన్నింటిని వినియోగంలోకి తీసుకువస్తే కేఎల్ఐ, జూరాల నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి లబ్ధి చేకూరుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇటీవల పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం, వేంకల్ లిఫ్టులకు రూ.33 కోట్లను మంజూరు చేసింది. జీల్‌దార్ తిప్ప చెరువును రిజర్వాయర్‌గా మార్చడంతో పాటు ఆ చెరువుకు కృష్ణానీటిని తరలించేందుకు రూ.31కోట్లను కేటాయించింది.

మూడు దశాబ్దాల క్రితం..

పెంట్లవెల్లి మండలంలోని కృష్ణానది తీరం వెంట మినీ లిఫ్టులు ఆరు ఉన్నాయి. వీటిలో మంచాలకట్ట లిఫ్టు వినియోగంలో ఉంది. మాధవస్వామినగర్ లిఫ్టు మరమ్మతుకు గురైంది. మల్లేశ్వరం, వేంకల్ లిఫ్టుల నిర్మాణాలను మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించారు. అప్పట్లో వెయ్యి ఎకరాలకు సాగునీరందించే విధంగా ఈ ఫ్టులకు శ్రీకారం చుట్టారు. ఏళ్లు గడుస్తున్నా వాటిని పూర్తి చేయకుండా వదిలిపెట్టారు. తరచూ పనుల పూర్తికి నిధులు విడుదల చేస్తున్నప్పటికీ పూర్తి కావడం లేదు. లిఫ్టులు వినియోగంలో లేకపోవడంతో వాటి సామగ్రి చోరీకి గురైంది. ప్రస్తుతం రెండు లిఫ్టులు ఎందుకు పనికిరాకుండా దిష్టిబొమ్మల్లా మారాయి. కృష్ణానది పక్కనే ఉన్నప్పటికీ సాగునీరందక స్థానిక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇటీవలనే ప్రభుత్వం రెండు లిఫ్టులను పూర్తిచేసి వినియోగం లోకి తీసుకువచ్చేందుకు నిధులు మంజూరు చేసింది. లిఫ్టుల కింద ఆయకట్టు విస్తీర్ణం పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. ఎన్నికలు ముగిశాక నిర్మాణ పనుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఎన్నో ఏళ్ల కల జీల్దార్‌తిప్ప రిజర్వాయర్

కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం సమీపంలోని నల్లమల అటవీప్రాంతంలో సురభి రాజవంశీకులు జీల్‌దార్‌తిప్ప చెరువును నిర్మించారు. సాగునీటితో పాటు, పశువుల దాహార్తి తీర్చేందుకు అక్కడి ప్రజలకు ఈ చెరువే దిక్కు. మాజీ ఎమ్మెల్యే రంగదాసు హయాంలో దీనికి మరమ్మతు చేపట్టి కొంతమేరకు అభివృద్ధి చేశారు. కేఎల్ఐ ప్రాజెక్టు సమీపంలోనే ఉన్న ముక్కిడిగుండం, గేమ్యానాయక్‌తండా, మొలచింతలపల్లికి నేటికీ కూడా సాగునీరు అందడం లేదు. జీల్‌దార్‌తిప్ప చెరువు నీళ్లే దిక్కు. ఈ చెరువును రిజర్వాయర్‌గా మార్చి కృష్ణానది నీటిని తరలించాలని స్థానికులు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. మొదట కాల్వల ద్వారా నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. ఈ పనులకు శిలాఫలకం కూడా వేశారు. అయితే భూసేకరణ, నీటి తరలింపులో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా పనులు పెండింగ్‌లో పడ్డాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని నీటిపారుదల శాఖ అధికారుల సూచన మేరకు కృష్ణానీటిని జీల్‌దార్‌తిప్ప చెరువులోకి ఎత్తిపోసే విధంగా డిజైన్లు మార్చారు. ఈ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత నెలలోనే ఈ పనులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి శిలాఫలకం వేశారు. జీల్‌దార్‌తిప్ప చెరువుకు మాజీఎమ్మెల్యే రంగదాసు పేరును పెడుతున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ చెరువుకు కృష్ణానీటిని మళ్లిస్తే దాని కింద ఉన్న 6వేల ఎకరాల ఆయకట్టుతో పాటు, కొత్తగా మరికొంత ఆయకట్టు భూములు కూడా సస్యశ్యామలం అవుతాయి.

నిధులు కేటాయించారు

మల్లేశ్వరం, వేంకల్ మినీ లిఫ్టుల పూర్తికి, జీల్‌దార్‌తిప్ప చెరువుకు కృష్ణానీటిని తరలించేందుకు ప్రభుత్వం ఇటీవలనే నిధులను కేటాయించింది. టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. కోడ్ ముగిశాక వీటికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభం అవుతుంది

– శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ

రైతులు బాగుపడతారు



జీల్‌దార్‌తిప్ప చెరువును అభివృద్ధి చేయాలని చాలా కాలంగా ఎమ్మెల్యేలను కోరుతూ వచ్చాం. ఎవరూ పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే ఈ అంశంపై చొరవ చూపారు. నిధులు మంజూరు చేయించారు. ఆయకట్టు రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చెరువుకు కృష్ణానీటిని మళ్లిస్తే వేలాది ఎకరాల ఆయకట్టు రైతులు బాగుపడతారు.

– బాలునాయక్, ముక్కిడిగుండం

వినియోగంలోకి తెస్తే మేలు



మల్లేశ్వరం, వేంకల్‌లో ఉన్న మినీ లిఫ్టులను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎంతో కాలంగా కోరుతున్నాం. అరకొర నిధులు కేటాయించి, పనులు చేసి వదిలిపెట్టడం అలవాటుగా మారిపోయింది. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి నిధులను కేటాయిచడం సంతోషకరం. లిఫ్టులు వినియోగంలోకి వస్తే ఎంతో మేలు కలుగుతుంది.

– మహేష్, మల్లేశ్వరం

మైనార్టీలకు అండగా కాంగ్రెస్



మైనార్టీ డిక్లరేషన్ ప్రతులను విడుదల చేస్తున్న నాయకులు

కల్వకుర్తి: మైనార్టీలకు అండగా ఎల్లప్పుడూ కాంగ్రెస్ ఉంటుందని, వారి సంక్షేమం గురించి ఆలోచించేది తమ పార్టీయేనని ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఫంక్షన్ హాలులో నిర్వహించిన మైనార్టీ డిక్లరేషన్ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించి, వారికి అన్ని రంగాలలో సముచిత ప్రాధాన్యం కల్పించిన ఘనత తమ పార్టీదేనన్నారు. చాలా మంది నిరుపేద విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ అందించి వారికి చేయూతనిచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండా నెరవేస్తుందని, మైనార్టీ డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా అన్ని హామీలను అమలుపరుస్తామన్నారు. అనంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కాంగ్రెస్‌లో ఫుల్‌జోష్

కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం నిర్వహించిన బలప్రదర్శన ర్యాలీతో కొత్త ఉత్సాహంతో పాటుగా, ఫుల్‌జోష్ కనిపించింది. పదేళ్లుగా పట్టణంలో ఎక్కడా కూడా కనిపించని కాంగ్రెస్ జెండాలు ఒక్కసారిగా కనిపించటంతో కార్యకర్తలతో పాటుగా ప్రజలలో చర్చ ప్రారంభమైంది. పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న సాయిబాలాజీ ఫంక్షన్ హాలు నుంచి ర్యాలీ ప్రారంభమై పట్టణంలోని పుర వీధుల గుండా దాదాపు 2 కి.మీ. మేర పార్టీ కార్యకర్తలు, జెండాలతో జనసంద్రంగా మారింది. ర్యాలీలో అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ బాలాజీసింగ్, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాధవి, అలీ మస్కతి, నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపే లక్ష్యంగా పని చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. మండలంలోని జూపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముస్తఫా, నాయకులు అజీం, రశీద్, మరికొంత ముంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వంశీచంద్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిక్లరేషన్‌తో మైనార్టీలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

వెల్దండ: కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి మద్దతుగా ఆయన సతీమణి మాధవి శనివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుందారంతండా, లాలుతండా, చొక్కన్నపల్లి, మండల కేంద్రంలో ఆరు గ్యారంటీలను వివరించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



జిల్లా కేంద్రంలో వృద్ధుడితో మాట్లాడుతున్న రాజేష్‌రెడ్డి

కందనూలు/తెలకపల్లి/తాడూరు: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ అభ్యర్థి రాజేష్ రెడ్డి తెలిపారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని 24వ వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రైతులు ఆగమైపోయారని, కాంట్రాక్టర్లు లాభం పొందారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిజాముద్దీన్, కావాలి శ్రీనివాసులు, సలీం, పాపమ్మ, రాధాకృష్ణ, రేణు బాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డిని గెలిపించాలని తెలకపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీలను ఓటర్లకు వివరించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి రాజేష్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, రాముడు, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డి సతీమణి సరిత అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడూరు మండలంలోని ఐతోల్‌లో ఇంటింటా తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో వివిధ పార్టీల నుంచి వచ్చిన యువకులు శనివారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అభివృద్ధి చేసే నాయకుడికే పట్టం



వెన్నంచర్లలో మహిళలతో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: పేదలకు సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మూడోసారి పట్టం కట్టాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్లలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం గణనీయ ప్రగతి సాధించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వృద్ధులకు రూ.5వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, తెల్లకార్డు కలిగిన వారకందరికీ బీమా సౌకర్యం, రూ.400 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, డాక్టర్ కుర్వ విజయ్‌కుమార్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పవన్ కుమార్ శర్మ మాజీ సర్పంచ్, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ శర్మ, గణేష్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, వెంకటయ్య, బెటరి నాగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

చేరికలు

బీఆర్ఎస్ పార్టీతోనే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని 11, 8 వార్డులు, చుక్కాయిపల్లి, ఎన్మన్‌బెట్ల, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామాలకు చెందిన నాయకులు కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఇంటింటి ప్రచారాలు

బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన తల్లి బిచ్చమ్మ కొల్లాపూర్‌లోని పలు వార్డుల్లో, పాన్‌గల్ మండలంలోని రేమద్దుల, శాగాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రంగినేని అభిలాష్‌రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, రాముయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, మౌనికయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి గెలిపించండి

తెలకపల్లి: మర్రి జనార్దన్‌రెడ్డిని మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసే కార్యక్రమాల గురించి ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ, రాములు, రవి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. మర్రిజనార్దన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిడ్జిల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు ఘటన సంబంధించిన వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చిల్వేర్‌కు చెందిన శేఖర్ (40) ఈనెల 4న కంచన్‌పల్లిలో పత్తిని లారీలో నింపుతుండగా, ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మర్రిజనార్దన్‌రెడ్డిని మూడోసారి గెలిపించి అసెంబ్లీకి పంపాలన్నారు. ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేద్దామని ఈ ఒక్కసారి కారు గుర్తుకు ఓటు వేయించాలన్నారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జంప్ జిలానీల జాతర

- ఉదయం ఒక పార్టీ, రాత్రి మరో పార్టీ కండువ
- తికమక పడుతున్న జనం

బల్మూర్: ఎన్నికల వేళ జంపు జిలానీల జిమ్మికులు ఓటర్లను తికమకకు గురి చేస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా చేర్చుకునే పనిలోనే ఉన్నారు. దీంతో రాత్రి ఒక పార్టీలో చేరిన వ్యక్తి, ఉదయాన్నే మరో పార్టీ కండువాతో దర్శనమిస్తుండటంతో రాజకీయానికి విలువలు లేవని ఓటర్లు విసుగు చెందుతున్నారు. కొంతమంది నాయకులు గ్రామాల్లో యువకులను ప్రలోభాలకు గురిచేస్తు అభ్యర్థుల వద్ద తమ బలప్రదర్శనతో కాసులు రాబట్టే కార్యక్రమాలు చేస్తూ ఉనికిని ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం యువకులను గుంపులుగా అభ్యర్థుల వద్దకు తీసుకెళ్లి వారు ఇతర పార్టీ వారని చెప్పి పార్టీలో కలుస్తున్నారని కండువాలు కప్పి ఫొటోలకు ఫోజులిస్తున్నారు. అక్కడ పార్టీలో చేరిన వారు మరుసటి రోజే తమని బలవంతంగా తీసుకెళ్లారని సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తుండటం విలువలు లేకుండా పోతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో కేవలం ఆయా పార్టీల్లో ఓటింగ్ బలమున్న నాయకులు మాత్రమే పార్టీలు మారితే వారి పేర్లు ప్రకటించి చేరికలు ఉండేవని, నేడు ఓటు హక్కు లేని వారు సైతం ఆపార్టీకి రాజీనామా చేసి, ఈ పార్టీలో చేరుతున్నామని ప్రకటించుకోవడంతో వినే వారే సిగ్గుపడుతున్నారు. గోదల్‌లో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ సమక్షంలో బీఆర్ఎస్ నాయకుడు చేరగా, శనివారం బీఆర్ఎస్ సొంత గూటికి చేరాడు.



వంశీకృష్ణతో బీఆర్ఎస్ నాయకుడు



బీఆర్ఎస్ నాయకులతో నాయకుడు

శివారు తోటల్లో సందడి

- తోటలు, ఫంక్షన్ హాళ్లకు ముందే బుకింగ్
- ఎన్నికల వేళ ముఖ్య అనుచరులు, అసంతృప్తులకు దావత్‌లు

అచ్చంపేట రూరల్: ఎన్నికల్లో రాజకీయ నాయకులు ఎన్నో ఎత్తులు వేస్తుంటారు. ప్రస్తుత శాసన సభ ఎన్నికల్లో పూర్తి స్థాయి ప్రచారానికి తెరలేపే ముందు పార్టీల అభ్యర్థులు శివారు తోటలు, శివారు ఫంక్షన్ హాళ్లు, ఫాంహౌస్‌లు, ఎవరికి తెలియని ప్రదేశాలను వేదికగా చేసుకుని మంత్రాంగం నడిపిస్తున్నారు. ఇక్కడి నుంచే ప్రచార వ్యూహాలకు పదును పెడుతూనే పోలింగ్ వరకు ఏర్పాట్లు, ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఎన్నికల కోడ్ పడినప్పటి నుంచి జిల్లాలోని పలు శివారు ప్రాంతాల్లో వివిధ పార్టీల నాయకులు బిజీబిజీగా గడుపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రతి రోజు సందడి నెలకొంది.

బర్త్‌డే, మ్యారేజ్ డేల పేరిట..

ఎన్నికల పుణ్యమా అని కొందరి డమ్మీ బర్త్‌డేలు, మ్యారేజ్ డేల పేరిట గ్రాండ్‌గా పార్టీలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున శివారు ప్రాంతాల్లో రహస్యంగా మందు, విందు భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో పోలీసు తనిఖీలు పెరిగాయి. రశీదులు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు, బంగారం, అక్రమ మద్యం తరలించినా కేసులు నమోదు చేస్తున్నారు. వీటినుంచి తప్పించుకోవడానికి వివిధ పార్టీల నాయకులు శివార్లలో ప్రశాంత వాతావరణం ఉండే తోటలు, ఫాంహౌస్‌లకు వెళ్తున్నారు. పార్టీలో అధినాయకులకు ముఖ్య అనుచరులుగా ఉన్న వారు ప్రచారంలో కీలకంగా వ్యవహరించినవారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో స్థానికులు, కాలనీల సంఘాలు, కుల సంఘాలు, నాయకులతో బాగా పరిచయాలున్న వారిని పిలిపించి అన్నీ చూసుకుంటున్నారు. అసంతృప్తులను మచ్చిక చేసుకుంటున్నారు. ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్నవారిని తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

పెరిగిన గిరాకీ..

వంట మనుషుల్ని పెట్టి అనుచరులకు ఏలోటూ రాకుండా చూసుకుంటున్నారు. డిసెంబర్ 3 వరకు బుకింగ్‌లు చేసుకున్నారని వాటి నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గాల్లో క్యాంపు కార్యాలయాల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థుల వేట మొదలైంది. ప్రచార కార్యక్రమాలన్నీ క్యాంపు కార్యాలయం కేంద్రంగానే చేస్తారు. వివిధ వర్గాలతో సమావేశాలు, అనుచరులతో భేటీలకు ఉపయోగించుకుంటారు. ప్రత్యేక గదులతో, ఎక్కువ విస్తీర్ణంలో ఉండే ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ ఉంది.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

పెంట్లవెల్లి: రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై విసుగు చెందారని మాజీ మంత్రి జూపల్లి అన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. శుక్రవారం రాత్రి మల్లేశ్వరం గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, హరిప్రసాద్, నర్సింహనాయుడు, రవి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత స్వామినారాయణ గురుకుల్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జరుగుతున్న 2వ జలజం సత్యనారాయణ క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. విజేతగా శ్రీస్వామినారాయణ గురుకుల్ జట్టు, రన్నరప్‌గా లిటిల్ స్కాలర్స్, మూడోస్థానంలో గెలాక్సీ పాఠశాల జట్లు నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లిటిల్ స్కాలర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లకు 60 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీస్వామినారాయణ గురుకుల 8.5 ఓవర్లలో 4 వికెట్లకు 63 పరుగులు చేసింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఫాతిమా విద్యాలయం 6 ఓవర్లలో 7 వికెట్లకు 38 పరుగులు చేయగా. అనంతరం బ్యాటింగ్ చేసిన గెలాక్సీ 4.1 ఓవర్లలో 3 వికెట్లకు 39 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయిరాం (లిటిల్ స్కాలర్స్ స్కూల్), బెస్ట్ బౌలర్‌గా ఉమర్ (ఫాతిమా విద్యాలయం), బ్యాట్స్‌మెన్‌గా చరణ్‌తేజ్ (శ్రీస్వామినారాయణ గురుకుల్), కీపర్‌గా హసన్ మిర్జా (లిటిల్ స్కాలర్స్) మెమొంటోలు అందుకున్నారు. జట్లకు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తదితరులు ట్రోఫీలు అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎండీసీఏ లీగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, వైశేషిరాయ్, విదూషిరాయ్, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్, బాలు, నాసర్, సోహైల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు